పోషకాహార విలువలపై అవగాహన



మల్కారంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

శంషాబాద్ రూరల్: గర్భిణులకు పోషకాహార విలువలపై మండలంలోని మల్కారంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు ఈ సందర్భంగా నాటికను ప్రదర్శించారు. వైవాహిక వేధింపులు, మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ టీంపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు.

అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో వెలసిన శ్రీ ఈదమ్మ శ్రీ భూలక్ష్మమ్మ అమ్మవార్ల ఒడిబియ్యం మహా ప్రసాదంగా వండి భక్తులకు గురువారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 2 వేల మంది భక్తులు ప్రసాదాన్ని ఆరగించి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, స్థానిక నేతలు కుమార్ గౌడ్, నరేందర్ రెడ్డి కొండకళ్ల, ఎం.మధుసూదన్, గుండ్ర కొమురయ్య, సందీప్ ముదిరాజ్, సులిగే వెంకటేశ్, రవికాంత్ రెడ్డి, ఎం.నాగేశ్, కడెం సుధాకర్, బొక్క బాల్‌రెడ్డి, గుంజ బాబురావు, ఇ.వేణుగోపాల్, మహిళా మోర్చా నాయకురాలు వినీతారెడ్డి, గడిల పద్మావతి, సరితారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 19వ డివిజన్‌లోని అభ్యుదయనగర్ కాలనీలో ఆయన పర్యటించారు. కాలనీ వాసులు పంచతంత్ర పార్క్‌లోని ఓపెన్ జిమ్ పరికరాలను కొంత మేర పాడైపోయిన పరికరాలను మరమ్మతులు చేయించాలని కమిషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తడి, పొడి చెత్తను వేరు చేసి ఇంటి వద్దనే మున్సిపల్ సిబ్బందికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రభుత్వం చేపట్టిన పట్టణ పరిశుభ్రత లక్ష్యాలను సాధించడానికి ప్రజల చొరవ కీలకం అనే విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. డీఈఈ యాదయ్య, సీనియర్ నాయకులు నరేందర్, కాలనీ ప్రధాన కార్యదర్శి నరేందర్‌బాబు, అశోక్, రమణ, రామలింగం, శివరాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం



మంత్రి వివేక్‌తో వినేష్‌బాబు, రాజువస్తాద్

గోల్కొండ: క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. షేక్‌పేట్‌లో జరగనున్న రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు రావాల్సిందిగా కోరుతూ హైదరాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలిసి ఆహ్వానపత్రం అందించారు. వినేష్‌బాబు, ఎస్.రాజువస్తాద్, రాజు తదితరులున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరం



విజయనగర్‌కాలనీ: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ అన్నారు. బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన సందర్భంగా గురువారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్, డిటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లును ఆసిఫ్‌నగర్ డివిజన్ శంకర్‌నగర్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శీలం బాలచందర్, నందుగౌడ్, రేనేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వనమహోత్సవం

- కొనసాగుతున్న మొక్కలు నాటే కార్యక్రమం
- గుంతలు సిద్ధం చేసిన మున్సిపాలిటీలు

మణికొండ: వర్షాలు ముమ్మరంగా కురుస్తున్నాయి. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో వనమహోత్సవ కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. దాంతో ప్రధాన రోడ్లు, పాఠశాలలు, చెరువులు, శ్మశానవాటికలు, పార్కులు శోభాయమానంగా మారుతున్నాయి. ఈ నెలాఖరు వరకు మరిన్ని మొక్కలను నాటి వీలైనంత ఎక్కువ పచ్చదనాన్ని పెంపొందించేందుకు జంట మున్సిపాలిటీల అధికారులు ముమ్మరంగా పనిచేస్తున్నారు.

లక్ష్య సాధనలో మున్సిపాలిటీలు...

ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను మించి మొక్కలను నాటి ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఈ సంవత్సరం 2.38 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. అందులో భాగంగా శ్రీరాంనగర్ కాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్‌లలో ఉన్న రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌లు, నెక్నాంపూర్ చెరువు, ల్యాంకోహిల్స్ నుంచి ఓఆర్‌ఆర్‌కు ఉన్న రోడ్డు, హుడాకాలనీ, అలకాపూర్ టౌన్‌షిప్ పార్కులు, దళిత శ్మశానవాటికలలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. దాంతో ఆయా రోడ్లు, పార్కులు, శ్మశానవాటికలు శోభాయమానంగా మారుతున్నాయి. ఇప్పటి వరకు 1.70 లక్షల మొక్కలను నాటి మిగిలిన మొక్కలను ఈ నెలాఖరులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో 1.19 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకుని పనిచేస్తున్నారు. అందులో భాగంగా గండిపేట చౌరస్తా నుంచి గండిపేట వరకు, నార్సింగి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వైఎస్సార్ సర్కిల్, రాయల్ ఫంక్షన్ హాల్ నుంచి నార్సింగి సర్కిల్ వరకు, నార్సింగిలోని గురుకుల బాలికల పాఠశాల, నార్సింగి హైట్స్‌లోని పార్కులలో ఇప్పటి వరకు 62 వేల మొక్కలను నాటారు.



మొక్కలు, రంగులతో శోభాయమానంగా తయారైన నార్సింగి వైఎస్సార్ సర్కిల్ రోడ్డు



నార్సింగి గురుకుల పాఠశాలలో పండ్ల మొక్కలను నాటిస్తూ...



మొక్కలతో అందంగా గండిపేట రోడ్డు

సొంత నర్సరీల్లోనే పెంపకం...

జంట మున్సిపాలిటీల్లో గతంలో ఇతర నర్సరీల్లోంచి మొక్కలను కొనుక్కొని వచ్చి రోడ్ల వెంట నాటేవారు. మణికొండలో రెండు సంవత్సరాల క్రితం మొక్కల పెంపకాన్ని టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌కు అప్పగించినా సఫలీకృతం కాలేదు. దాంతో గత సంవత్సరం నుంచి మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మూడు, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో రెండు చోట్ల సొంత నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. రోడ్ల పక్కన నాటాల్సిన పెద్ద మొక్కలను మాత్రం చిలుకూరు మృగావనిలో అటవీశాఖ వారు పెంచుతున్నవి తెచ్చి నాటుతున్నారు. మున్సిపాలిటీలు నాటుతున్న మొక్కలలో రాయల్‌పాం, మహాగని, పొగడ, నేరేడు, మామిడి, రావి, బహోనియా, పూల మొక్కలు, నిమ్మ, దానిమ్మ, ఉసిరి, జామ, బాదాం, కొబ్బరి, టికోమా లాంటి మొక్కలను సొంత నర్సరీల్లోనే వర్మికంపోస్టు ఎరువులను వేసి పెంచినవే అధికంగా ఉన్నాయి.



మణికొండ ల్యాంకోహిల్స్ నుంచి ఔటర్‌కు వెళ్లే రోడ్డులో మొక్కలను నాటిస్తున్న దృశ్యం

విజయవంతం చేస్తాం



మణికొండ మున్సిపాలిటీ పరిధిలో మొక్కలను నాటేందుకు, వాటిని సంరక్షించేందుకు అనువైన స్థలాలను గుర్తించి పెద్ద ఎత్తున నాటుతున్నాం. దాంతో రోడ్ల పక్కన అవి ఎంతో శోభాయమానంగా కనిపిస్తున్నాయి. మొక్కలు ఏపుగా పెరగటంతో రోడ్ల రూపురేఖలు మారిపోతాయి. ఈసంవత్సరం అనువైన స్థలాలను ఎంపిక చేసి పనులను మొదలు పెట్టాం. టార్గెట్‌ను పూర్తి చేసి వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం.

– డి.ప్రదీప్‌కుమార్, కమిషనర్, మణికొండ

రోడ్లకు సొబగులు



నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రధాన రోడ్లను శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. అందులో భాగంగా డివైడర్లలో పెద్ద వాటితో పాటు చిన్న మొక్కలను నాటుతున్నాం. డివైడర్లకు రంగులు వేసి మరింత అందం తెస్తున్నాం. పార్కులు, పాఠశాలల్లో ఎక్కువ మొత్తంలో మొక్కలను నాటి నందన వనాలుగా తయారు చేస్తున్నాం. ప్రజలకు, పిల్లలకు ఉపయోగపడే పండ్ల మొక్కలను నాటుతున్నాం. ఈ నెలాఖరుకు టార్గెట్‌లు పూర్తి చేస్తాం.

– టి.కృష్ణమోహన్‌రెడ్డి, కమిషనర్, నార్సింగి

విద్యుత్ సిబ్బందిపై దుర్భాలాడిన మహిళపై కేసు

రాజేంద్రనగర్: విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో కనెక్షన్లు తొలగించేందుకు వెళ్లిన విద్యుత్ సిబ్బందిని దుర్భాషలాడిన ఓ మహిళపై విద్యుత్ సిబ్బంది రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విధులకు ఆటంకం కల్పించడంతో పాటు దూషించినందుకు తగు చర్యలు తీసుకోవాలంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... ఉప్పర్‌పల్లి పర్మారెడ్డి హిల్స్‌కు చెందిన ఫాతిమా విద్యుత్ శాఖకు రూ. 17 వేలు విద్యుత్ బకాయి ఉంది. బకాయిలు చెల్లించాలని విద్యుత్ సిబ్బంది షేక్ అహ్మద్ పలు మార్లు వెళ్లి తెలిపినా పట్టించుకోవడం లేదు. దీంతో షేక్ అహ్మద్ గురువారం మధ్యాహ్నం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తానని తెలిపి విద్యుత్ పోల్‌పై ఉన్న కనెక్షన్‌ను తొలగించేందుకు ప్రయత్నించాడు. దీంతో షేక్ అహ్మద్‌తో పాటు వచ్చిన సిబ్బందిని ఫాతిమా దుర్భాషలాడింది. విధులకు సైతం ఆటంకం కలిగించింది. షేక్ అహ్మద్ విషయాన్ని రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అధికారికి ఫిర్యాదు చేసి... ఆయన ఆదేశాల మేరకు రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

గోల్కొండ: తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగిన కూడా కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ భారీ ఆధిక్యంతో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు టి.జీవన్‌సింగ్ అన్నారు. గురువారం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాములు, రంగారెడ్డి, శ్రీకాంత్‌సాగర్, దశరథ్, బాబురావు, సత్యం, దీపక్ తదితరులున్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై అవిశ్రాంత పోరు



అత్తాపూర్ పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న పీఆర్‌టీయూ నేతలు

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి

అత్తాపూర్: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై అవిశ్రాంత పోరాటాలు చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నామని పీఆర్‌టీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి అన్నారు. పీఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాల సందర్భంగా గురువారం అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని, సమస్యలన్నింటినీ తొందరలోనే పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో అన్ని సంఘాల కంటే ముందు వరుసలో ఉంటామన్నారు. అందుకుగాను ఉపాధ్యాయులందరూ సంఘానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు సాయిప్రసాద్, పీఆర్టీయూ రాజేంద్రనగర్ మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్, అసోసియేట్ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, అల్లావెల్లి, ఉపాధ్యక్షుడు సత్తయ్యగౌడ్, కార్యదర్శి చిండం వెంకటయ్య, సంఘం సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, భాస్కర్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సీజనల్ వ్యాధులకు చెక్

మణికొండ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉంటే సీజన్ వాధులకు చెక్ పెట్టవచ్చని అధికారులు సూచించారు. వాతావరణంలో మార్పులు నెలకొన్నందున ప్రజలు, గర్భిణులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలని నార్సింగి మున్సిపాలిటీ వార్డు అధికారులు రాజశ్రీ, సుష్మ, ఏఎన్‌ఎంలు నిర్మల, స్వరూప సూచించారు. గురువారం మంచిరేవుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వారు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నీటిని వేడి చేసుకుని తాగాలని, వేడి పదార్థాలనే తినాలని, బయటి పదార్థాలను తినవద్దని సూచించారు. అనంతరం కోకాపేట పోయనిక్స్ గ్రీన్ స్కూల్‌లో తడి చెత్తతో వర్మి కంపోస్టు ఎరువుగా తయారు చేస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. నార్సింగి అంగన్‌వాడీ పాఠశాలలో చిన్నారులకు తడి, పొడి చెత్త వేరు చేయటంపై అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు సుజాత, రుక్మిణి, శ్రీదేవి, వార్డు అధికారులు గణేష్, శ్యామ్‌గౌడ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వార్డు అధికారులు

ఘనంగా కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు

రాజేంద్రనగర్ జోన్ బృందం: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కె.టి.రామారావు పుట్టినరోజు వేడుకలును రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. వాడవాడలా సేవా కార్యక్రమాలను నిర్వహించారు. రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్ దంపతులు కేటీఆర్‌ను కలిసి బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సేవా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేటీఆర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న కార్పొరేటర్ అర్చన జయప్రకాశ్



బీఆర్‌ఎస్ బండ్లగూడ అధ్యక్షుడు నాగరాజు...



గణేష్‌నగర్‌లో విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న వెంకటేష్



మణికొండలో సంబరాలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



టీఎన్‌జీవోస్ కాలనీలో...

వరద సాఫీగా వెళ్లేలా పటిష్ఠ చర్యలు

రాజేంద్రనగర్ డీసీ డాక్టర్ రవికుమార్



రాజేంద్రనగర్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రోడ్లపై వరద నీరు నిలువకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపడుతున్నామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. రెండు వాహనాలతో పాటు ఐదు మాన్‌సూన్ టీమ్స్, మరో ప్రత్యేకంగా 10 మంది సిబ్బందిని నియమించామన్నారు. గురువారం సర్కిల్ పరిధిలో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం ఐదు డివిజన్లలో ఐదు మాన్‌సూన్ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మాన్‌సూన్ సిబ్బంది తమ డివిజన్లలోని బస్తీలు, కాలనీలు, ప్రధాన రోడ్లపై 24 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వరదనీరు ఎక్కడా నిలువ ఉండకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే రోడ్లపై నిలిచిన ఇసుక దిబ్బలను తొలగిస్తున్నట్లు తెలిపారు. వరదనీటి మ్యాన్‌హోళ్లను ఎప్పటికప్పుడు శుభ్ర పరుస్తున్నామన్నారు. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీల్లో ఎక్కువగా నీరు నిలువ ఉన్న చోట ప్రత్యేక సిబ్బందిని నియమించామన్నారు. సర్కిల్ పరిధిలో రెండు వాహనాలలో ఎమర్జెన్సీ సిబ్బంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో సూపర్‌వైజర్‌తో పాటు సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. 24 గంటల పాటు సిబ్బంది పని చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదులు అందిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రజలు వరదనీరు వెళ్లేందుకు కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లతో పాటు వరద నీటి మ్యాన్‌హోళ్ల తెరిచారని... వాటిని ఇప్పటికే సరిచేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఇళ్లల్లోని చెత్త ఇతర వ్యర్థాలను డ్రైనేజీ పైపులైన్‌లలో వేయరాదని డీసీ సూచించారు. డ్రైనేజీలతో పాటు వరదనీటి కాలువలు శుభ్రం చేసినా ప్లాస్టిక్ కవర్లు, చెత్తాచెదారం, ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు అడ్డంకిగా మారుతున్నాయని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు చైతన్యవంతులై బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

- తరచూ జరుగుతున్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

అత్తాపూర్: కేబుల్ ఆపరేటర్లు, ఇంటర్నెట్ సర్వీసుల నిర్వాహకులు ప్రధాన రహదారుల్లో ఉన్న విద్యుత్ స్తంభాలకు కుప్పలుతెప్పలుగా కేబుల్ వైర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఏదో ఒక వ్యాపారం చేసుకునే వారు కేబుల్ సమస్య వచ్చినప్పుడు విద్యుత్ స్తంభాలపైకి ఎక్కి వారికి ఉన్న సమస్యను పరిష్కరించుకుంటారు. సమస్యను పరిష్కరించుకునే మిగతా కేబుల్ కనెక్షన్‌కు అంతరాయం కలుగుతూ ఉంటుంది. దీంతో తిరిగి ఆపరేటర్లు సమస్యను పరిష్కరించుకోవడం దినచర్యలో భాగంగా మారిపోయింది. హైదర్‌గూడ, అత్తాపూర్, రాంబాగ్, సిక్‌చౌనీ, పాండురంగానగర్, శివానగర్, తేజస్వీని కాలనీ, కాంతారెడ్డినగర్, జనప్రియ తదితర ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లను ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని ప్రాంతాలలో బలహీనంగా ఉన్న విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగిపోయాయి. వర్షాకాలంతో పాటు గాలి దుమారాలు వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అత్తాపూర్ ప్రధాన రహదారి సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా, సమీపంలో ఉన్న గోల్డెన్ ప్యాలెస్ హోటల్ సమీపంలో హైటెక్షన్ విద్యుత్ స్తంభానికి ప్రమాదకర రీతిలో కేబుల్ వైర్లను అమర్చుకున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ఈ కేబుల్ వ్యవస్థ తీరుపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



హైదర్‌గూడ చౌరస్తాలోని స్తంభానికి వేలాడుతున్న కేబుల్ వైర్లు

అందరి సహకారంతో బోనాలు విజయవంతం



టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తదితరులు

గోల్కొండ: అందరి సహకారంతో గోల్కొండ కోట బోనాలు విజయవంతమయ్యాయని టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం చివరి బోనం రోజున గోల్కొండ కోటలో ఆయనను వృత్తిపని వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారీగా వచ్చే భక్తులకు కోటలోని అన్ని ప్రాంతాల్లో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గోల్కొండ బడాబజార్, చోటాబజార్‌తో పాటు తొట్టెల ఊరేగింపులు వచ్చే మార్గాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, వీర్‌సింగ్ తదితరులున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

రాజేంద్రనగర్: ఇంటి ముందు పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మామిడి కిశోర్ సమాచారం మేరకు... బండ్లగూడ ఎన్‌ఎఫ్‌సీ కాలనీకి చెందిన రమేశ్ ప్రైవేటు ఉద్యోగి. తన ప్యాషన్ ప్రో వాహనాన్ని రాత్రి ఇంటి ముందు పార్కు చేస్తాడు. ఈ నెల 9వ తేదీన రాత్రి ఇంటి ముందు పార్కు చేసి ఉదయం చూడగా కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

శంషాబాద్–షాబాద్ రహదారి అధ్వానం

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

శంషాబాద్ రూరల్: ఓ వైపు ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం.. మరో వైపు రహదారి విస్తరణ పనులతో వాహనదారులు నరకం చూస్తున్నారు. రూ. కోట్లు వెచ్చించి శంషాబాద్–షాబాద్ రహదారి విస్తరణ చేపట్టగా.. కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో రోడ్డుపై గుంతలు ప్రమాదకరంగా మారాయి. సరైన ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా పనులు చేస్తుండటంతో ఈ దుస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాళ్లగూడ నుంచి నర్కూడ వరకు 3 కిలోమీటర్ల దూరం నరకప్రాయంగా మారింది. అడుగడుగునా గుంతలు పడి.. అందులో వర్షపు నీరు నిలుస్తుంది. కొన్ని చోట్ల రోడ్డు బురదగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



పద్మావతి ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు ఇలా...



నర్కూడ శివారల్లో కల్వర్టు నిర్మాణం దగ్గర...



శంషాబాద్-షాబాద్ రహదారిలోని అమ్మపల్లి దేవాలయం సమీపంలో...